సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 31 । జూలై । 2023



జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు విచారణ

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా నూతన పంచాయతీలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి పంచాయతీకి కార్యదర్శులు ఉండేలా చర్యలు చేపట్టింది. 8లో▸



రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధి

చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలు చేస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్నిప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా సాగాలి

● డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా ముందుకుసాగాలని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విఠల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 200మంది కుంట సది ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయి కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ వైఖరితోనే రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి వరదముప్పు ఏర్పడిందన్నారు. ముందు చూపులేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం ద్వారా పారిశ్రామిక ప్రాంత ప్రజలు వరద ముప్పుతో భయాందోళన మధ్య కాలం వెళ్లదీయాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా, చుక్కల శ్రీనివాస్, గట్ల రమేష్, దూళికట్ట సతీష్, నజీం, కొటం సతీష్‌తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

మహాసభలు ఘనంగా నిర్వహించాలి

● ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ 16వ మహాసభలను ఘనంగా నిర్వహించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో ఆదివారం మహాసభల ఆహ్వాన సంఘం సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ఏఐటీయూసీ, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు సభల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. గోదావరిఖనిలో ఆగస్టు 25 నుంచి 27వరకు మహాసభలు జరగనున్నాయన్నారు. ఫండ్స్, ప్రచారం, ఫుడ్, డెకోరేషన్, వాలంటీర్ కమిటీలను ప్రకటించారు. ప్రతి కమిటీలో కన్వీనర్, 20 మంది సభ్యులు ఉంటారు, వీరంతా తమతమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మహాసభల జయప్రదం కోసం కృషి చేస్తారని పేర్కొన్నారు. నాయకులు కవ్వంపల్లి స్వామి, ఎల్.ప్రకాశ్, వైవీ.రావు, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కన్నం లక్ష్మీనారాయణ, ఆరెల్లి పోశం, మడ్డి ఎల్లాగౌడ్, కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, కె.కనకరాజ్, బుర్ర తిరుపతి, మడికొండ ఓడెమ్మ, ఆహ్వాన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వచ్చేనెల 6 వరకు ప్యాసింజర్ రైళ్ల రద్దు



రామగుండం: భారీ వర్షాల కారణంగా ఖాజీపేట-బల్లార్షా మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను ఈనెల 31వరకు రద్దు చేసిన రైల్వేశాఖ.. తాజాగా మూడో రైల్వేట్రాక్ పనులు, ఇతరత్రా కారణాలతో ఆగస్టు 6వరకు పొడిగించింది. రద్దయిన ప్యాసింజర్లలో కాజీపేట-సిర్పూర్ కాగజ్‌నగర్ (రామగిరి-17004/17004), కాజీపేట-బల్లార్షా (బల్లార్షా ఎక్స్‌ప్రెస్-17035/36), భద్రాచలం రోడ్-బల్లార్షా (సింగరేణి-17033/34) ఉన్నాయి. ప్రయాణికులు గమనించాలని ఆ శాఖ అధికారులు కోరారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామివారిని ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి దర్శించుకున్నారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేశారు. బోనం చేసి సమర్పించారు.

సుల్తానాబాద్ బల్దియా కమిషనర్‌గా మల్లికార్జున్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున్ పదోన్నతిపై రానున్నారు. ఇక్కడ పనిచేసిన రాజశేఖర్ హుస్నాబాద్‌కు ఇటీవల బదిలీ అయ్యారు. అప్పటినుంచి సుల్తానాబాద్ కమిషనర్ ఖాళీగానే ఉంది. బదిలీల్లో లక్సెట్టిపేట నుంచి (గ్రేట్-2 కమిషనర్‌గా) పదోన్నతిపై సుల్తానాబాద్‌కు బదిలీపై రానున్నారు.

మేధావులు మేడిన్ ఎస్సారార్



ప్రభుత్వ ఉద్యోగులు.. రాజకీయ నాయకులు.. కవులు.. కళాకారులకు పుట్టినిల్లు కరీంనగర్‌లోని ఎస్సారార్ (శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ) కళాశాల. సాధారణ విద్యార్థిగా చేరి.. విద్యార్థి నాయకులుగా, రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసే కవులుగా సరిహద్దుల్లో రక్షణగా నిలుస్తున్న సైనికులుగా ఇక్కడి ఎన్‌సీసీ కెడెట్లే అధికం. బడుగు బలహీనవర్గాలకు సేవ చేస్తున్న వారిలో ఇక్కడి నుంచే వెళ్లిన ఎస్ఎస్ అభ్యర్థులూ ఉన్నారు. ఇలా అన్ని రంగాల్లో తన విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపిన ఎస్సారార్ కాలేజీ సగర్వంగా తలెత్తుకు నిలబడింది. కరీంనగర్ నగర నడిబొడ్డున 26 ఎకరాల విస్తీర్ణంలో నిల్చొని విద్యాకుసుమాలను సమాజానికి అందిస్తోంది.



కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ సిటీ: 'కరీంనగర్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసు సెలక్షన్స్ జరుగుతున్నాయి. అందులో ఎంపికైన అభ్యర్థుల్లో దాదాపు 70 శాతం మంది ఎస్సారార్‌కు చెందినవారే. ఇది గమనించిన ఓ అధికారి ఆరా తీయగా.. ఆ కాలేజీలో విద్యార్థులకు ఎన్‌సీసీలో ఇచ్చే కఠోర శిక్షణే కారణమని తెలిసింది'

- శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల.. డిగ్రీ, పీజీ చదువుకున్న ప్రతి వ్యక్తికీ ఈ కాలేజీ తెలుసంటే అతిశయోక్తి కాదు. ఇందులో చదువుకోవాలని ప్రతి విద్యార్థి కల. ఇక్కడ సాధారణ విద్యార్థులే ప్రవేశాలు పొందుతారు. చేరాక విద్యతోపాటు వికాసం, క్రమశిక్షణ(ఎన్‌సీసీ), నాయకత్వం, సామాజిక సేవ(ఎన్ఎస్ఎస్), పరిశోధనలు(ల్యాబ్), క్రీడలు, కళలు ఇలా అన్ని విధాలా తీర్చిదిద్దబడి బయటకొస్తారు.
- కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న ఈ కాలేజీ 10 జిల్లాల విద్యార్థులకు వరంగా మారుతోంది. కవులు, కళాకారులు, నాయకులు, పోలీసులు, అధికారులు, ఉద్యోగులను సమాజానికి అందించిన ఈ కాలేజీ నాటి వైభవానికి నేటి ఆధునికతకు వారధిగా నిలుస్తోంది.
- శ్రీరాజరాజేశ్వర ఆలయం, వేములవాడ పేరున 1956లో ప్రైవేట్ భాగస్వామ్యంలో కాలేజీని స్థాపించారు. మొదటి ప్రిన్సిపాల్‌గా ఏవీ గోపాల్‌రావు వ్యవహరించారు. 1959లో అప్పటి సర్కారు దీన్ని ప్రభుత్వ కాలేజీగా మార్చింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఈ కాలేజీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా కొనసాగారు. 1959-91 వరకూ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రొఫెసర్ చలపతిరావు, ప్రొఫెసర్ కేవైఎల్.నర్సింహారావు హయాంలో అభివృద్ధికి బాటలు పడ్డాయి. 2018 నుంచి ప్రొఫెసర్ రామకృష్ణ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. కాలేజీ పరిధిలో 2016 వరకు 15 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా.. ప్రస్తుతం నాలుగు ఉన్నాయి. ఈ కాలేజీలో ప్రస్తుతం 45 డిగ్రీకోర్సులు, 11 పీజీ కోర్సులు, 5 సర్టిఫికెట్ కోర్సులు అందిస్తూ కాకతీయ వర్సిటీ తర్వాత ఉత్తర తెలంగాణలోనే అతి పెద్ద కాలేజీగా గుర్తింపు తెచ్చుకుంది. 2022 మార్చిలో యూజీసీ, న్యూఢిల్లీ నుంచి అటానమస్ హోదా లభించింది. న్యాక్ 'ఏ' గ్రేడ్ హోదా 2027 వరకూ ఉంది. వీటితోపాటు ఐఎస్‌వో సర్టిఫికెట్ కూడా పొందింది.

- విద్యార్థిగా చేరి.. ఉత్తములుగా అవతరించి
- విద్యార్థి నాయకుల నుంచి రాజకీయ నేతలుగా ఎదిగి..
- కవులు, కళాకారుల పుట్టినిల్లు
- మినీ యూనివర్సిటీగా ఖ్యాతి
- 45 డిగ్రీ కోర్సులు, 11 పీజీ కోర్సులు
- 5 సర్టిఫికెట్ కోర్సులు, 1,620 సీట్లు



అవార్డులు.. రివార్డులు

- దేశంలోనే ఎస్సారార్ కాలేజీ గ్రీన్ క్యాంపస్‌గా పేరుగాంచింది. గ్రీన్‌బిల్డింగ్ అవార్డును పొందింది.
- 64 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో యూనివర్సిటీ స్థాయిలో బంగారు పతకాలు సాధించారు.
- జిజ్ఞాస ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రస్థాయిలో విద్యార్థి పరిశోధన ప్రాజెక్టులో ఏడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. 10 సార్లు వివిధ సందర్భాల్లో రాష్ట్రస్థాయి బహుమతులు గెలుచుకుంది.
- కాలేజీలో డాక్టర్ మహేశ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన సెమినార్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 120 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.
- అధ్యాపకులు రాజు, మల్లారెడ్డి, వరప్రసాద్‌తోపాటు మరికొందరు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక బహుమతులు అందుకున్నారు.
- డాక్టర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో 3 జాతీయ స్థాయి సదస్సులు నిర్వహించారు. దీనికి 10 జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి విద్యావేత్తలు హాజరయ్యారు.
- శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డాక్టర్ భిక్షపతి, డాక్టర్ సతీశ్‌కుమార్‌కు పీహెచ్‌డీ గైడ్‌షిప్ కల్పించారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న ఎన్‌సీసీ కెడెట్లు (ఫైల్)

ఎన్నో సౌకర్యాలు

- కరీంనగర్ సిటీ మధ్యలో మినీ యూనివర్సిటీగా పిలిచే ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ, పీజీ కాలేజీ 26 ఎకరాల సువిశాల ప్రాంగణంలో విస్తరించి ఉంది.
- 45 డిగ్రీ కోర్సుల్లో 1,620 సీట్లు అందుబాటులో ఉండగా తాజాగా 'దోస్త్' మొదటిఫేజ్‌లో 1,016 సీట్లు భర్తీ అయ్యాయి.
- 108 తరగతి గదులు ఉండగా పూర్తిగా ఆధునీకరించిన బోటనీ, జువాలజీ, బయోటెక్నాలజీ, మైక్రో బయలాజీ తదితర 10 ల్యాబ్‌లున్నాయి.
- కాలేజీలో జిమ్, గ్రంథాలయంలో 53,450 పుస్తకాలు, 15 జర్నల్స్, 25 మ్యాగజైన్స్, 18 వార్త పత్రికలు కాలేజీకి చేరుతుంటాయి.
- ఎస్సారార్ వివిధ విభాగాల్లో 67 మంది(వాస్తవానికి 89) అధ్యాపకులు వివిధ విభాగాల్లోని అంశాలు బోధిస్తున్నారు. 42 మంది గెస్ట్‌లెక్చరర్లు, 25 మంది నాన్-టీచింగ్ స్టాఫ్ ఉన్నారు.



- అతిపెద్ద ఆడిటోరియం, మినీ ఆడిటోరియం కూడా అందుబాటులో ఉన్నాయి.
- ఎన్ఎస్ఎస్ ఐదు యూనిట్లలో 600 మంది విద్యార్థులు కెడెట్లుగా ఉన్నారు.
- ఎన్‌సీసీలో 160 మంది విద్యార్థులు ఉన్నారు. జాతీయస్థాయిలో పలు అవార్డులు, రివార్డులు పొందారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన పలు అడ్వెంచర్ క్యాంపుల్లో ఎస్సారార్ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాలుపంచుకున్నారు.
- ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఐక్యూఏసీ, ఇఫ్లూ బినెట్, మన టీవీ పాఠాలు, జిజ్ఞాస, మూక్స్, టాస్క్, స్వయం ఉపాధి వంటి పథకాలు అమలు చేస్తున్నారు.
- రెడ్డిల్యాబ్, మహీంద్ర వంటి కంపెనీలలో పరస్పరం ఒప్పందంతో విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి



అటానమస్ హోదాతో ఉన్న ఎస్సారార్ కాలేజీలో విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నాం. అధ్యాపకుల సహాయంతో నూతన విధానాలు అమలు చేస్తున్నాం. విద్యార్థుల ఆసక్తి మేరకు వారికి పలు సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తున్నాం. దోస్త్ మొదటి ఫేజ్‌లోనే రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు భర్తీ అయ్యాయి. స్వయం ఉపాధి రంగాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తూ ఉద్యోగాలు పొందేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్, ఎస్సారార్ కాలేజీ(అటానమస్)

నాయకుడిగా జన్మనిచ్చింది



విద్యార్థి రాజకీయాల్లో ఓనమాలు నేర్పిన కాలేజీ ఎస్సారార్. విద్యతోపాటు నాయకత్వ లక్షణాలు కాలేజీలోనే అలవడ్డాయి. బీసీ రిజర్వేషన్ల కోసం జరిగిన దేశవ్యాప్త ఉద్యమంలో కాలేజీలో ఎన్ఎస్‌యూఐ తరఫున చురుగ్గా పాల్గొన్నాను. అదే నాకు గుర్తింపును తెచ్చింది. ఈరోజు సమాజ సేవ చేసే అదృష్టం లభించిందంటే ఎస్సారార్ కాలేజీనే కారణం.

– పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ

పుష్కలమైన వనరులున్న కాలేజీ



దేశంలో ఏ ప్రైవేటు కాలేజీకీ తీసిపోని అధునాతన సదుపాయాలు ఎస్సారార్ కాలేజీ సొంతం. తరగతి గదులు, మైదానం, గ్రంథాలయం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ల్యాబ్స్ ఒకటేమిటి.. అనంతమైన వనరులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులు రత్నాల్లా రాటుదేలుతారు. ఎన్ని ప్రైవేటు కాలేజీలు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగాల్లో అధికశాతం ఎస్సారార్ కాలేజీ విద్యార్థులే సాధించడం ఇందుకు నిదర్శనం.

– వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

వ్యాధుల ముప్పు.. అప్రమత్తతే మందు

గ్రామాల్లో ఫీవర్ సర్వే ఇలా..

మొత్తం టీంలు	336
జిల్లాలో ఇళ్లు	1,98,833
జిల్లా జనాభా	7,95,332
సర్వే చేసిన జనాభా	63,315
వ్యాధిగ్రస్తుల గుర్తింపు	382మంది



సుల్తానాబాద్‌లో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది



సుల్తానాబాద్‌లో మంచినీటి బావిలో బ్లీచింగ్ చేస్తున్న సిబ్బంది

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కాచి చల్లార్చిన నీటిని తాగాలి
- తాగునీటిని తప్పక క్లోరినేషన్ చేయాలి
- నీటి సరఫరా పైపులకు లీకేజీ లేకుండా చూడాలి
- వ్యాధి ప్రబలిన ప్రాంతాల్లోని ఇళ్లలో తాగునీటి బిందెలను క్లోరినేషన్ చేయాలి. బిల్లలు వేసి బాగా కరిగిన తర్వాత తాగాలి.
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- నిలువ ఆహారపదార్థాలు, కుళ్లిపోయిన కూరగాయలు తినొద్దు.
- వేడి ఆహారపదార్థాలు తినాలి.

సుల్తానాబాద్: భారీ వర్షం వరదతోపాటు విషజ్వరాలనూ తీసుకొచ్చింది. ప్రజలు డెంగీ, టైఫాయిడ్, మలేరియాతో అల్లాడుతున్నారు. వీధులు, ఆవాసాలపై నీరు నిలిచి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల వరద పరిస్థితిని సమీక్షించేందుకు సుల్తానాబాద్ వచ్చిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లావ్యాప్తంగా వరద ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖకు సూచించారు. దీంతో అప్రమత్తమైన ఆ శాఖ జిల్లావ్యాప్తంగా ఫీవర్‌సర్వే చేపట్టింది. జ్వరపీడితులు లేకున్నా.. దగ్గు, జలుబుతో బాధపడుతున్నవారి సంఖ్య అధికంగా ఉన్నట్లు తేలుతోంది.

ప్రైవేట్ దోపిడీ

జలాశయాల్లో కొత్త నీరు చేరడంతో వాటిని తాగిన ప్రజలు ముఖ్యంగా దగ్గు, జలుబుతో బాధపడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు డెంగీ బూచి చూపి రోగుల జేబులకు చిల్లు పెడుతున్నారు. అవసరం లేకున్నా రకరకాల పరీక్షలు చేస్తున్నారు. రక్తకణాలు తగ్గుతున్నాయంటూ భయాందోళనకు గురి చేస్తున్నాయి.


కలవరపెడుతున్న డెంగీ

జిల్లాలో ప్రధానంగా గోదావరి, మానేరు నదులు ఈ ఏడు సామర్థ్యాన్ని మించి ప్రవహించాయి. దీంతో గ్రామాల్లో బురద చేరింది. ఖాళీ ప్లాట్లలో నీరు నిలిచి చాలామంది విషజ్వరాల బారినపడ్డారు. కొందరు డెంగీతో బాధపడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఐదుగురు డెంగీ బారిన పడ్డట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

సర్వే కొనసాగుతోందిలా..

జిల్లాలో 18 పీహెచ్‌సీలు, ఆరు అర్బన్ పీహెచ్‌సీ ఉన్నాయి. మంథని, సుల్తానాబాద్‌లో సామాజిక, జిల్లాకేంద్రంతోపాటు గోదావరిఖనిలో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లాకేంద్ర ఆస్పత్రిలో రోజుకు 200 నుంచి 250 మంది ప్రజలు వివిధ రకాల రోగాలతో వస్తున్నారు. వీరిలో జ్వరం, దగ్గు, జలుబు బారిన వారు వంద మందికిపైగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. వ్యాధులు మరింత ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఫీవర్ సర్వే చేపట్టినట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ తెలిపారు. మొత్తం 336టీంలను నియమించామని, వీరు ఇప్పటివరకు 382 మంది విషజ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారని, వారికి మందులు పంపిణీ చేశామని తెలిపారు.


వైద్యులను సంప్రదించాలి



ముసురుతో జ్వరాల బారిన పడే అవకాశముంది. వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాం. జ్వరం, జలుబు ఉన్నవారు నిర్లక్ష్యం చేస్తూ పరిస్థితి విషమించాక ఆసుపత్రులకు వస్తున్నారు. అలాకాకుండా లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలి.

– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి


అప్రమత్తంగా ఉన్నాం



వరద ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశాం. ఫీవర్ సర్వే చేపడుతున్నాం. వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం. అధికారుల సమన్వయంతో గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తున్నాం.

– డాక్టర్ చంద్రశేఖర్, గర్రెపల్లి


సర్వే కొనసాగుతోంది



ఆశావర్కర్లు గ్రామాల్లో ఫీవర్‌సర్వే చేపడుతున్నారు. ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నాం. గ్రామాల్లో అక్కడక్కడ జ్వరం కేసులు నమోదవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేస్తున్నాం.

– వెంకట్‌రెడ్డి, హెచ్ఎస్, గర్రెపల్లి

ఇంటింటా సర్వే



ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టాం. లక్షణాలున్న వారిని గుర్తించి స్థానిక ఏఎన్ఎంలకు సమాచారం ఇస్తున్నాం. కలుషితమైన నీరు, ఆహార పదార్థాలు తీసుకోవద్దు. డెంగీ వంటి వ్యాధులు రాకుండా చూసుకోవాలి.

– రమ, ఆశావర్కర్, సుల్తానాబాద్

సంక్షేమ పథకాలతో నిరుపేదల్లో వెలుగు

● బస్తీబాటలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ప్రజలను కలుసుకుని సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. ఆదివారం స్థానిక 31వ డివిజన్‌లోని శివాజీనగర్‌లో భరోసా బస్తీబాట నిర్వహించారు. కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్ర సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న సీఎంకు మద్దతుగా నిలవాలని కోరారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానన్నారు. రూ.15లక్షలతో డివిజన్‌లో ఏర్పాటుచేసిన మిషన్ భగీరథ నల్లాలను ప్రారంభించారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు అడ్డాల స్వరూప, అయిత శివకుమార్, కో-ఆప్షన్ మెంబర్ చెరుకు బుచ్చిరెడ్డి, నాయకులు పర్లపల్లి రవి, నారాయణదాసు మారుతి, తోడేటి శంకర్‌గౌడ్, తానిపర్తి గోపాల్‌రావు, చెలుకలపల్లి శ్రీనివాస్, దాసరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



తాత రవి

కాల్వశ్రీరాంపూర్: తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ స్టూడియో సెక్టార్ కౌన్సిల్ కార్యదర్శిగా మండలంలోని పెగడపల్లికి చెందిన తాత రవియాదవ్ విజయం సాధించారు. రవి యాదవ్ విజయంపై గ్రామస్తులు ఆదివారం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. తన విజయానికి సమాకరించిన కె.రామకృష్ణ, పి.విశ్వనాథ్ రావు, పి.కళ్యాణ్, ప్రసన్నకు రవియాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో గెలిపించినందుకు శక్తి వంచన లేకుండా సేవలందిస్తానని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇదీ తాగునీరే


సరఫరా అవుతున్న కలుషిత నీరు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా సింగరేణి ప్రభావిత గ్రామమైన వెంకట్రావుపల్లి కేకేనగర్‌కు సింగరేణి యజమాన్యం సరఫరా చేసిన తాగునీరు నల్లరంగులో వచ్చింది. దీంతో గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆ నీరు కనీసం కాలకృత్యాలకూ పనికి రాకుండా ఉందని వాపోయారు. సింగరేణి యాజమాన్యం స్పందించి తాగు నీటిని ఫిల్టర్ చేసి అందించాలని ప్రజలు కోరుతున్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


సోమరాజు(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన బోయోజు సోమరాజు(52) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు, తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం సోమరాజుకు భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుమారుడు 12 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా కుమారుడి దినకర్మ నిర్వహించిన రెండు రోజులకు తండ్రి ఆనారోగ్యం పాలై గోదావరిఖని ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. ఈక్రమంలో ఆదివారం చికిత్సపొందుతూ గుండెపోటుకు గురై మరణించినట్లు కుటుంబసభ్యులు, సిబ్బంది తెలిపారు. 10 రోజుల వ్యవధిలోనే కుమారుడు, తండ్రి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు అందరిని కలిచివేశాయి. సోమరాజు మృతికి టూటౌన్ సీఐ వేణుగోపాల్, రామగుండం సీపీ అధికారులు సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం , పోలీస్ సిబ్బంది మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి వారిని ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న నల్ల

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుల్తానాబాద్ పట్టణానికి చెందిన బోనగిరి సమ్మయ్య బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న బీఆర్ఎస్ నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి గాయాలపాలైన సమ్మయ్యను ఆటోలో చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సచేసిన వైద్యులు తదుపరి చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

అడవిపంది దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

మంథని: మండలంలోని సూరయ్యపల్లి శివారులో మాజీ ఎంపీటీసీ బీముని వెంకటస్వామిపై అడవిపంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం గ్రామ సమీపంలోని పొలంవద్దకు వెళ్లిన స్వామిపై ఒక్కసారిగా అడవిపంది దాడిచేసింది. దీంతో తీవ్రగా గాయపడిన అతడిని స్థానిక వైద్యశాలలో ప్రథమచికిత్స అందించి కరీంనగర్‌కు తరలించారు.

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు విచారణ

- జిల్లాలోని 266 జీపీల్లో 185 మంది పంచాయతీ కార్యదర్శులు
- నాలుగేళ్లు పూర్తిచేసుకున్న వారిని క్రమబద్ధీరణకు ఉత్తర్వులు
- పలు గ్రామాల్లో అధికారుల సందర్శన
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం


కాల్వశ్రీరాంపూర్ మండలంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జేపీఎస్‌లు

సుల్తానాబాద్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా నూతన పంచాయతీలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి పంచాయతీకి కార్యదర్శులు ఉండేలా చర్యలు చేపట్టింది. 2019లో జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)లను నియమించింది. వీరు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తుండగా అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు, జనన, మరణ ధ్రువపత్రాలు, వివిధ పనులు చేయిస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం వీరికి విధులు కేటాయించింది.

మార్గదర్శకాలు జారీ

జిల్లాలోని 266 పంచాయతీల్లో 185 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. వీరు విధుల్లో చేరే సమయంలో రెండేళ్ల పాటు ప్రొబేషన్ తర్వాత క్రమబద్ధీకరణ చేసేలా ప్రణాళిక రూపొందించారు. కానీ రెండేళ్లు పూర్తయినా వీరివేతనం రూ.15 వేల నుంచి రూ.30 వేలకు పెంచి ప్రొబేషన్‌ను మరో ఏడాది పొడిగించారు. మూడేళ్ల తర్వాత కూడా వీరిని క్రమబద్ధీకరించకపోవడంతో గత మే నెలలో వీరు 16 రోజుల పాటు సమ్మెచేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీతో విధుల్లో చేరారు. తాజాగా క్రమబద్ధీకరణకు అవసరమైన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీచేసింది.

14 మండలాల్లో పరిశీలన

జిల్లాలో మొత్తం 14 మండలాల్లో 266 గ్రామాల్లో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న జేపీఎస్‌లు విధులు నిర్వహిస్తున్న గ్రామాలను త్రిసభ్య కమిటీ సభ్యులు పరిశీలించనున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల సందర్శన పూర్తయింది. మొక్కల సంరక్షణ, ట్రాక్టర్ ఈఎంఐలు, రికార్డుల నిర్వహణ, డంపింగ్ యార్డు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, మురుగుకాల్వల పరిశుభ్రత, తదితర పనులను పరిశీలించి మార్కులు కేటాయిస్తున్నారు. త్వరలో మిగతా మండలాల్లోని గ్రామాల్లో సందర్శించి సంబంధిత వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నారు. నాలుగేళ్లు పూర్తి చేసుకున్న కార్యదర్శుల పనితీరు పరిశీలించిన తర్వాత మిగతా జేపీఎస్‌ల పనితీరును కూడా ఇదే మాదిరి సందర్శించి పరిశీలించనున్నారు.

పని తీరే ఆధారం

నాలుగేళ్లు పూర్తిచేసుకున్న పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలోని 266 పంచాయతీల్లో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న జేపీఎస్‌లు 185 మంది ఉన్నారు. వీరు పనిచేసే గ్రామాల్లో పనితీరు ఆధారంగా తొలి విడతలో క్రమబద్ధీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీరి పనితీరును పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ ఆయా పంచాయతీల ప్రగతిని సందర్శించి మార్కులు కేటాయించనుంది. 65 మార్కుల కన్నా తక్కువ వస్తే వారి పనితీరు బాగాలేదని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించనుంది. త్రిసభ్య కమిటీలో అదనపు కలెక్టర్, డీఎస్పీ, జిల్లా అటవీ అధికారులను ప్రభుత్వం నియమించింది.

అందరినీ క్రమబద్ధీకరించాలి

నాలుగేళ్లు చేసిన జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదు. జేపీఎస్‌లందరినీ క్రమబద్ధీకరించాలి. రాష్ట్ర ప్రభుత్వానికి పంచాయతీ కార్యదర్శులు ద్వారా ఎన్నో అవార్డులు వచ్చాయి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఎంతో కృషిచేస్తున్నాం.

– భాను ప్రసాద్, జేపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు, పెద్దపల్లి

విచారణ లేకుండా పర్మినెంట్ చేయాలి

ముగ్గురు అధికారులతో విచారణ చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించాలి. గ్రామాల్లో జేపీఎస్‌లు అందిస్తున్న సేవలపై వివరాలు సేకరిస్తారు. విచారణ, నివేదిక లేకుండానే జూనియర్ పంచాయతీ కార్యదర్శులందరినీ పర్మినెంట్ చేయాలి.

– ఉమాపతి రెడ్డి, జూనియర్ పంచాయతీ కార్యదర్శి, గట్టేపల్లి

వరద బాధితులకు రూ.వంద కోట్లు కేటాయించాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ఇటీవల కురిసిన భారీవర్షాలకు నష్టపోయిన గోదావరి పరివాహక ప్రాంత వరద బాధితుల కోసం సింగరేణి యాజమాన్యం రూ.వంద కోట్లు కేటాయించి ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు ఐ.కృష్ణ కోరారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అకాల వర్షాలతో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోయి రోడ్డున పడ్డారన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు సాగుభూములు, నివాస గృహాలతో పాటు మరెన్నో ఆస్తులను సర్వం దారపోశారన్నారు. సింగరేణి సంస్థను జేబుసంస్థగా మార్చుకొని ఇష్టానుసారంగా డబ్బులను నీళ్లలా ఖర్చు చేస్తున్నారన్నారు. భూపాలపల్లి, ఇల్లెందు, బెల్లంపల్లి, మణుగూరు, కొత్తగూడెం, రామగుండం ఏరియాలోని పలు గ్రామాల ప్రజలను ఆదుకోవడానికి రూ.వందకోట్లు తక్షణ సాయంగా అందించాలన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఓ గనికి సంబంధించి వర్షాలతో గోదావరి ప్రమాదకరంగా మారిందంటూ లేఆఫ్ ప్రకటించడం దారుణమన్నారు. వెంటనే కార్మికులకు పూర్తిస్థాయి వేతనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, నరేశ్, కొమురయ్య, బాబు, దుర్గయ్య, మొగిలి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంతాగి విధుల్లోకి...

- కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్


సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష చేస్తున్న పోలీస్

ధర్మారం: మండలంలోని కొత్తూరు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మద్యంతాగి ఆపరేటర్‌గా విధులు నిర్వహించిన గజ్జెల మహేందర్‌ను సస్పెన్షన్ చేస్తూ ఆదివారం విద్యుత్‌శాఖ పెద్దపల్లి డివిజనల్ ఇంజినీర్ దాసరి తిరుపతి ఉత్తర్వులు జారీచేశారు. మద్యంతాగిన మహేందర్ సంబంధిత విద్యుత్‌శాఖలో ఫీల్డ్‌వర్క్ చేస్తున్న లైన్‌మెన్‌ల టెలిఫోన్‌లకు స్పందించకపోవడంతో పాటు సరిగా సమాధానం ఇవ్వకపోవడంతో సస్పెన్షన్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలీసులచే బ్రీత్ అనలైజర్ టెస్టు...

కొత్తూరు సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్‌కు పోలీసులు శనివారం సాయంత్రం బ్రీత్ అనలైజర్ పరీక్ష చేసినట్లు సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహేందర్‌కు సాయంత్రం కటికెనపల్లిలో 11కేవీ లైన్‌లో సమస్యతలెత్తడంతో లైన్‌మెన్ ఆపరేటర్‌కు ఫోన్‌చేసినప్పటికీ స్పందించలేదు. దీంతో లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్‌చేసి ఆపరేటర్ ఫోన్‌తీయడం లేదని వెంటనే ఎల్‌సీ ఇప్పించాలని కటికెనపల్లి లైన్‌మెన్ ఫోన్‌లో తెలిపాడు. సదరు సిబ్బంది సైతం ఆపరేటర్‌కు ఫోన్ చేసినా స్పందించలేదు. వెంటనే వారు ధర్మారం ఏఈకు సమాచారం ఇవ్వగా సబ్‌స్టేషన్‌కు వెళ్లి చూడాలని ఆదేశించారు. సదరు సిబ్బంది సబ్‌స్టేషన్‌కు వెళ్లి చూడగా ఆపరేటర్ నిద్రలో ఉన్నాడు. నిద్రలేపేందుకు యత్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పరిస్థితిని ఏఈకి వివరించారు. అనారోగ్యానికి గురికావొచ్చని భావించిన ఏఈ వెంటనే కొత్తూరు సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఆపరేటర్‌తో మాట్లాడగా మద్యంమత్తులో ఉన్నట్లు గమనించి ఏడీకి ఫిర్యాదు చేశారు. ఏడీ పెద్దపల్లి విద్యుత్‌శాఖ డివిజనల్ అధికారికి ఫోన్‌లో వివరించారు. పోలీసులకు ఫిర్యాదుచేసి బ్రీత్ అనలైజర్ చేయించాలని డీఈఈ సూచించారు.

పోలీసులకు ఫిర్యాదు..

విధుల్లో ఉన్న ఆపరేటర్ మద్యంమత్తులో డ్యూటీ చేస్తున్నాడని ధర్మారం ఎస్సై సత్యనారాయణకు ఏఈ ఫిర్యాదుచేశారు. స్పందించిన ఎస్సై వెంటనే కానిస్టేబుల్‌ను కొత్తూరు సబ్‌స్టేషన్‌కు పంపించి బ్రీత్ అనలైజర్ పరీక్ష చేశారు. దీంతో 240 రీడింగ్ చూపించినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను ఏడీ పెద్దపల్లి డీఈఈకి శనివారం సాయంత్రం పంపించారు. నివేదిక ఆధారంగా ఆదివారం ఆపరేటర్‌ను సస్పెన్షన్ చేస్తూ డీఈఈ ఉత్తర్వులు జారీచేశారు. సబ్‌స్టేషన్‌లో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాల్సిన ఆపరేటర్ తాగిన మత్తులో డ్యూటీ చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తితే ఫీల్డ్‌లో ఉండే సిబ్బంది ఆపరేటర్‌పైనే ఆధారపడి ఎల్‌సీ తీసుకుని పనులు చేస్తుంటారు. తాగిన మత్తులో డ్యూటీచేస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశాలుంటాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేటర్‌పైనే ఆధారపడి తాము విద్యుత్ తీగలపై పని చేస్తుంటామన్నారు.

రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధి

- రూ.2వేల చొప్పున జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


సాగు చేస్తున్న రైతు

సుల్తానాబాద్(పెద్దపల్లి): చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది మొదటి విడత సాగు సాయం మంజూరు చేసింది. అర్హులైన రైతుల ఖాతాల్లోకి ఎకరాకు రూ.2వేల చొప్పున జమ చేసింది. ఈ పథకం కింద ఏడాదికి మూడు విడతల్లో (నాలుగు నెలలకోసరి) రూ.2వేల చొప్పున అందజేస్తామని 2018లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అదే ఏడాది డిసెంబర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించగా అర్హులైన రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున అందాయి. 14వ విడతలో ప్రస్తుతం 2023 గాను డబ్బులు మంజూరయ్యాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 67,846 మందికి..

కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు గురువారం రాత్రి విడుదల చేయగా, వ్యవసాయ శాఖ రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసింది. ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి గల చిన్న, సన్న కారు రైతులు ఈ పథకానికి అర్హులు. జిల్లాలో 67,846 మందిని అర్హులుగా గుర్తించారు. రూ.13,56,92,000 జమ చేశారు. ఇందులో ఈ ఏడాది తొలి విడతగా లబ్ధి చేకూరింది. కాగా కొంత మంది రైతులకు బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలు తప్పుగా ఉన్న కారణంగా డబ్బులు జమ కాలేదని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి వారు తమ వివరాలు సక్రమంగా ఉంటే అందజేయాలని, వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని పేర్కొంటున్నారు. ఇప్పటికే కొందరి వివరాలు అప్‌డేట్ చేశామని అధికారులు తెలిపారు.

ఖాతాల్లో జమ..



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద జిల్లాలో మొదటి విడతలో 67,846 మంది రైతులకు రూ.2వేల చొప్పున వారి ఖాతాల్లోకి జమ అయినవి. కొందరు రైతుల బ్యాంకు ఖాతా నంబర్లు, ఆధార్‌లో తప్పులు ఉన్నాయి. సరైన వివరాలు సమర్పిస్తే వారికి కూడా త్వరలో జమ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

రెండు కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడిన నిందితులతో ఎస్సై స్వామి

గోదావరిఖని: మహారాష్ట్ర నుంచి పెద్దపల్లికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీచేస్తుండగా అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టుబడింది. పెద్దపల్లికి చెందిన కల్లెపల్లి గోపి, కట్కూరి నగేశ్, ఈర్ల శంకర్ మహారాష్ట్రలోని జమీల్ అనే వ్యక్తినుంచి కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా ఆకస్మిక తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు ఆటోతో పాటు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రామగుండం తహసీల్దార్ సమక్షంలో పంచనామ నిర్వహించి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.


రోడ్డు దుస్థితి

ధ్వంసమైన గోదావరి రోడ్డు

మంథని: వారంరోజులు కురిసిన భారీవర్షాలు, వరదలతో పలుచోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. మంథని వద్ద గోదావరి ఉధృతితో సుమారు 150 కిలోమీటర్లు ముందుకు వచ్చి ప్రధాన రోడ్డుపై ప్రవహించింది. ఈక్రమంలో రోడ్డు చాలా చోట్ల ధ్వంసమై గుంతలు ఏర్పడింది.


ఏర్పడిన గుంత

విద్యుత్ స్తంభాల విధ్వంసం

- నేలకూలిన వంద ట్రాన్స్‌ఫార్మర్లు
- మూడు వందలకు పైగా స్తంభాలు
- ఇసుక మేటల్లో చిక్కుకున్న విద్యుత్ లైన్లు
- నష్టం అంచనాకు క్షేత్రస్థాయి సర్వే
- తీర ప్రాంతాల్లో రెండు నెలలు అంతరాయం


సిరిపురం సమీపంలో విరిగిన స్తంభం


పడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మంథని: వరద బీభత్సానికి గోదావరి, మానేరు తీర ప్రాంతంలో విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. నదుల పరీవాహక ప్రాంతాల్లో వ్యవసాయానికి విద్యుత్ అందించే 100 ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు వందలకుపైగా స్తంభాలు అక్కరకు రాకుండా పోయాయి. అనేకచోట్ల విద్యుత్ లైన్లు బురదలో కూరుకుపోయాయి. ఫలితంగా వ్యవసాయానికి రెండునెలల పాటు విద్యుత్ సరఫరా అందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది.

కోట్లలో నష్టం

గతేడాది వరదలతో విద్యుత్ శాఖకు రూ.30కోట్లకు పైగా నష్టం తెచ్చిపెట్టగా ఈసారి కూడా అదేస్థాయిలో ఉండొచ్చని ప్రాథమిక అంచనాలను బట్టి తెలుస్తోంది. గతేడాది జూలైలో మంథని డివిజన్ పరిధిలోని గోదావరి తీరంలోని ఖానాపూర్, ఖాన్సాయిపేట, సోమన్‌పల్లి, వెంకటాపూర్, ఆరెంద, మల్లారం, పోతారం, ఉప్పట్ల, విలోచవరం, మంథని ప్రాంతంలో పెద్ద టవర్లు పడిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు అక్కరకు రాకుండా పోవడంతో చిన్న టాన్స్‌ఫార్మర్ల స్థానంలో పెద్దవి బిగించారు. కొత్త లైన్లను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఈ సారి గోదావరి తీరంలో పెద్దగా నష్టం వాటిల్లలేదుగాని మానేరు తీరంలో భారీ నష్టం వాటిల్లింది. మంథని మండలం చిన్నఓదాల, గోపాల్‌పూర్, పెద్దఓదాల, అడవిసోమన్‌పల్లి, నాగెపల్లి, ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్, ఓడెడు, ముత్తారం అలాగే గోదావరి తీరంలో సిరిపురం, పోతారం, విలోచవరం గ్రామాల సమీపంలో నష్టం భారీగా జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

క్షేత్ర స్థాయిలో పర్యటన

విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్న ప్రాంతాల్లో గ్రామాలకు మాత్రమే విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన అధికారులు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు నిలిపివేశారు. తీర ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ సర్వే చేస్తున్నారు. ఆయా ప్రాంతాల ఏఈలతో పాటు కింది స్థాయి సిబ్బంది సర్వే చేస్తుండగా పెద్దపల్లి ఎస్ఈ సుదర్శన్, డీఇ శివరాం, ఇతర స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

రెండు మాసాలు సరపరా కష్టమే

వ్యవసాయ రంగంలో చిన్నాభిన్నమైన విద్యుత్ పునరుద్ధరించడానికి మరో రెండు మాసాలు పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. సర్వే నిర్వహించి నష్టాన్ని అంచనా వేసి అందుకు తగిన నిధులు సమకూరిన తర్వాత పనులు మొదలు పెడతారు. ఇదంతా పూర్తికావడానికి రెండు మాసాలు పడుతుందని అధికారులు అంటున్నారు. అప్పటివరకు తీర ప్రాంతాల్లో వ్యవసాయం ముందుకు సాగే పరిస్థితి లేదు. ఈ సీజన్‌పై రైతులు ఆశలు వదులుకోవాల్సిందే.

'అల్ఫోర్స్' అధినేతకు సన్మానం


నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ రెడ్డి ప్రతిష్ఠాత్మక ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న విషయం విధితమే. ఈ సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని వావిలాలపల్లి అల్ఫోర్స్ జూనియర్ కళాశాల మెయిన్ క్యాంపస్‌లో ఆయనను ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకొని, జిల్లా కీర్తిని చాటాలని సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సంయుక్త కార్యదర్శి దారం జగన్నాథరెడ్డి, సప్తగిరికాలనీ, శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడు చెన్నాడి రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు.